

అభివాదం తెలుపుతున్న విగ్రహ సాధన దీక్ష నాయకులు

పూలే దంపతుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై పెట్టాలి

- ఐదెకరాల్లో పూలే నాలెడ్జ్ సెంటర్ నిర్మించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ
- ఇందిరాపార్కు వద్ద పూలే దంపతుల విగ్రహ సాధన దీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో విద్యా విప్లవం సృష్టించిన పూలే దంపతుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదెకరాల్లో పూలే నాలెడ్జ్ సెంటర్ నిర్మించాలని కోరారు. శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహ సాధన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఎంవీ రమణ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు సమానత్వం కోసం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తుల చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండటానికి ఆ దంపతుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. మహిళలను వంటింటి బానిసగా చూసే రోజుల్లో తన భార్య సావిత్రిబాయి పూలేకు స్వయాన జ్యోతిరావు పూలే చదువు బోధించారని చెప్పారు. తద్వారా ఆమె ఇతర మహిళలకు విద్యాబోధన చేసే విధంగా ప్రోత్సహించారని తెలిపారు. అటువంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జాతర వలె జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చదువుల తల్లి కోవెలలోని చేయించే విధంగా పూలే నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. దేశంలో విద్యా విప్లవం తీసుకొచ్చిన గొప్ప సంఘ సేవకులు పూలే దంపతులు అని కొనియాడారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పూలే జయంతి కార్యక్రమాల సందర్భంగా వారి విగ్రహాల ఏర్పాటుపై మంత్రులు హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు హర్షించదగ్గ విషయమన్నారు. అంబేద్కర్ స్వయాన పూలే తన గురువు అని చెప్పారని గుర్తు చేశారు. ఈ నెల 11న పూలే జయంతి వేడుకల్లో విగ్రహ ఏర్పాటుపై ప్రకటన చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి వి హనుమంతరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల మల్లేష్, గాయకురాలు విమలక్క, బిసి సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారపు గణేష్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, నాయకులు ఇందిరా శోభన్ పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ కోసం అడ్డదారులు

- నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి సహాయనిధి కోసం కొందరు అడ్డదారులు తొక్కారు. ఆస్పత్రుల్లో నకిలీ బిల్లులు రూపొందించి వాటితో దరఖాస్తు చేసుకున్నారు. అనుమానం వచ్చిన ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి చెందిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మోసం బయటపడింది. సచివాలయంలోని రెవెన్యూ శాఖ అధికారి మూర్తి నెల క్రితం సైఫాబాద్ పోలీసులకు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. సైఫాబాద్ పోలీసులు ఈ కేసును సిసిఎస్‌కు బదిలీ చేశారు. సిసిఎస్ అధికారులు.. సిఎం సహాయనిధి అధికారులు పంపించిన పత్రాలన్నింటినీ పరిశీలించారు. ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రితో పాటు, మిర్యాలగూడలోని మరో ప్రయివేటు ఆస్పత్రి నిర్వాహకులు అక్రమంగా డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించినట్టు తేలింది. రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నకిలీ బిల్లులు రూపొందించినట్టు సిసిఎస్ పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరి కొందరు ఇదే తరహాలో మోసానికి పాల్పడి ఉండొచ్చని సిసిఎస్ అధికారులు అనుమానిస్తున్నారు.



జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకూ మాస్టర్ హెల్త్ చెకప్ చేయాలి

- మంత్రి హరీశ్‌రావుకు ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాస్టర్ హెల్త్‌చెకప్ పథకాన్ని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకూ వర్తింపజేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, పి ఆనందం, పి రాధిక, వై ప్రభాకర్, కార్యదర్శి బి జగదీశ్వర్, కార్యవర్గ సభ్యులు పి నాగవాణి, హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్‌కుమార్ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు, మాస్టర్ హెల్త్ చెకప్ తదితర పథకాల పట్ల చర్చ చోటుచేసుకుంది. మహిళా జర్నలిస్టుల కోసం చేపట్టిన మాస్టర్ హెల్త్ చెకప్ పథకంతో మంచి ఫలితాలు వచ్చాయని ఫెడరేషన్ బృందం మంత్రికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఆపథకాన్ని మొత్తం జర్నలిస్టులతోపాటు వారి కుటుంబ సభ్యులకూ అమలు చేయాలని కోరింది. ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన హెల్త్‌కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తెచ్చారు. హెల్త్ కార్డులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్‌చెకప్ పథకం అమలుచేయడానికి అభ్యంతరం లేదన్నారు. జిల్లాల్లో కొంత ఇబ్బంది ఉంటుందని, టెస్ట్‌ల పరికరాలు జిల్లాలకు తరలించడం కొంచెం కష్టమవుతుందన్నారు. త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

మాట తప్పిన మోడీ

- సింగరేణి గనులపై కుట్ర
- బొగ్గు గనులను ప్రయివేటీకరించబోమని ఇదే గడ్డపై ప్రకటన
- తాజాగా వేలంలో నాలుగు గనులు
- రూ.కోట్లు ఖర్చుచేసి ఆ గనులను గుర్తించిన సింగరేణి సంస్థ
- భగ్గుమంటున్న బిఆర్ఎస్ సహా వామపక్ష, కార్మిక లోకం
- నేడు రాష్ట్రంలోని బొగ్గు గనుల్లో ఆందోళనలు, మహాధర్నాకు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థ.. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సంస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి సర్కారు పెద్ద కుట్రకే తెరలేపింది. గతేడాది నవంబర్‌లో రామగుండం వచ్చిన మోడీ.. సింగరేణి సంస్థలో రాష్ట్రానికే 51 శాతం వాటా ఉందని, ఇక్కడి బొగ్గు గనులను కేంద్రం ఎలా ప్రయివేటీకరిస్తుందని ప్రశ్నించారు. ఇప్పుడవి పచ్చి అబద్ధాలని తేలింది.

కేంద్ర గనుల శాఖ విడుదల చేసిన బొగ్గుగనుల వేలం నోటిఫికేషన్ తాజా ఉదాహరణ. తన అనుంగు మిత్రుల నేతృత్వంలో బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అప్పగించేందుకు రాష్ట్రంలోని నాలుగు బొగ్గుగనుల వేలం వేయబోతుంది. ఈ నేపథ్యంలో రామగుండం పర్యటన తరువాత శనివారం హైదరాబాద్‌కు ప్రధాని వస్తున్న సందర్భంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు, మహాధర్నా నిర్వహించేందుకు కార్మిక సంఘాలు, బీఆర్ఎస్ పిలుపునిచ్చాయి.

చెప్పేదొకటి.. చేసేదొకటి..

గతేడాది నవంబర్‌లో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని ప్రారంభించిన ప్రధాని మోడీ సింగరేణి ప్రయివేటీకరణ చేయబోమని చెప్పారు. సింగరేణిలో 51 శాతం వాటా రాష్ట్ర సర్కారుకే ఉందని, వేలం వేసేందుకు తమకు హక్కు లేదని చెప్పుకొచ్చారు. కరోనా సమయంలో విదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతున్నట్టు ప్రకటించిన మోడీ దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి భారీగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ పిలుపులో విదేశీ వ్యతిరేకత పేరుతో దేశభక్తిని చాటుకుంటున్నట్టు నటిస్తూ సింగరేణి సంస్థను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు తెరదీశారు. అందులోనూ రూ.కోట్లు ఖర్చు చేసి సత్తుపల్లి, పెనుగడప, శ్రావణపల్లి, కల్యాణ్



ఖని బొగ్గు బ్లాకులను గుర్తించిన సింగరేణి సంస్థను కాదని వాటిని వేలం వేసి ప్రయివేటుకు అప్పగించేందుకు కేంద్ర గనుల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సింగరేణి వ్యాప్తంగా నేడు ఆందోళనలు

ప్రధాని మోడీ చేసిన పచ్చి అబద్ధాలపైనా, సింగరేణి సంస్థ పరిరక్షణకు బీఆర్ఎస్, వామపక్ష, కార్మికలోకమంతా ఆందోళనకు సిద్ధమయ్యాయి. నేడు ప్రధాని హైదరాబాద్ పర్యటనలో భాగంగా సింగరేణి పరిధిలోని కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున నిరసన పోరాటాలకు సంసిద్ధం కావాలని సిఐటియు, ఎఐటియుసి, టిబిజికెఎస్ సహా అధికారపార్టీ బిఆర్ఎస్ పిలుపునిచ్చాయి. మంచిర్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం ఏరియాల్లో మహా ధర్నాలు చేపడుతున్నట్టు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటించారు. గనుల కేటాయింపులో గుజరాత్ ప్రభుత్వానికి కల్పించిన వెసులుబాటు మాదిరిగానే తెలంగాణలోని సింగరేణి గనులకూ అమలు చేయాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేంగర్ల మల్లయ్య డిమాండ్ చేశారు.

సింగరేణి బ్లాక్‌ల వేలం ఎప్పటి నుంచో...

గతంలో 2021 అక్టోబర్ 13న తెలంగాణలోని నాలుగు బ్లాక్‌లకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వేలం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో కొయ్యగూడెం బ్లాక్ -3ని ఆరో కోల్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి 2022 అక్టోబర్ 14న కేటాయించారు. అయితే, ఈ కేటాయింపును 2023 మార్చి 13న నిలిపివేశారు. 2021 డిసెంబర్ 16న, 2022 మార్చి 30న మళ్లీ అవే నాలుగు బ్లాక్‌లకు వేలం వేసేందుకు నోటిఫికేషన్లు ఇచ్చారు. అప్పుడు వేలానికి సరైన కోట్ ఎవరూ చేయకపోవడంతో వేలం నిలిపివేశారు. తరువాత 2022 నవంబర్ రెండున ఇచ్చిన నోటిఫికేషన్‌లో పెనగడప, కల్యాణ్‌ఖని బ్లాక్-6, సత్తుపల్లి బ్లాక్-3, శ్రావణపల్లి గనులకు వేలానికి పిలవగా.. సత్తుపల్లి బ్లాక్ -3కి ఒక్కరే కోట్ చేశారు. అప్పుడూ వేలం నిలిచిపోయింది. తాజాగా గత నెల మార్చి 29న రెండు నోటిఫికేషన్లను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి విడుదల చేశారు. అందులో సత్తుపల్లి, శ్రావణపల్లి, పెనగడప బ్లాక్‌లు ఉన్నాయి. ఇప్పుడు దీనిపైనే రాష్ట్ర సర్కారు, వామపక్ష పార్టీలు, సింగరేణి కార్మికలోకం భగ్గుమంటోంది.

మోడీ కుట్రలను అడ్డుకుంటాం :సిఐటియు

ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్మికుల జీవితాలను కష్టాల్లోకి నెట్టివేసే ప్రధాని కుట్రలను అడ్డుకుంటామని సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే ప్రజల కష్టాలు తీరుతాయని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా అవిశ్రాంత ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.

కేంద్రంపై జంగ్‌సైరన్

సింగరేణి ప్రయివేటీకరణ కుట్రలపై.. కేంద్రంలోని బిజెపి సర్కార్‌పై జంగ్ సైరన్ పూరించాం. మంత్రి కెటిఆర్ పిలుపు మేరకు శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'మహాధర్నా' నిర్వహించనున్నాం. ఇందులో పెద్దఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలి.

- కోరుకంటి చందర్- రామగుండం ఎమ్మెల్యే

కేంద్రం చర్యలతో సింగరేణి కార్మికుల్లో ఆందోళన

- నేటి ఆందోళనలను జయప్రదం చేయండి : మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోన్న నేపథ్యంలో ఆ సంస్థకు చెందిన కార్మికుల్లో ఆందోళన నెలకొందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర చర్యలను నిరసిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించతలపెట్టి ఆందోళనలను జయప్రదం చేయాలని ఆయన ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణిని ప్రయివేటీకరించబోమంటూ చెబుతున్న కేంద్రం... బొగ్గు బ్లాకులను ఎందుకు వేలానికి పెట్టిందంటూ మంత్రి ఈ సందర్భంగా ప్రశ్నించారు. వాటిని ఆ సంస్థకే ఎందుకు ఇవ్వటం లేదని నిలదీశారు. లాభాల్లో ఉన్న సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు యత్నించటం శోచనీయమని అన్నారు. గతంలో రామగుండంలో పర్యటించిన సందర్భంగా ప్రధాని మోడీ... ఆ సంస్థను ప్రయివేటీకరించబోమంటూ హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆ వాగ్దానాన్ని విస్మరించి, బొగ్గు బ్లాకుల వేలానికి తెర తీశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రి మోడీపై ఒత్తిడి తేవటం ద్వారా బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని కోరారు. లేదంటే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎర్రబెల్లి హెచ్చరించారు.

పేదలకు అండ ఎర్రజెండా

- తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో తమ్మినేని వీరభద్రం శుక్రవారం విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తొమ్మిందేళ్లలో దళితులు, గిరిజనులు అట్టడుగు వర్గాలపై దాడులు, లైంగికదాడులు, హత్యలు పెరిగాయని విమర్శించారు. మనువాద సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టేందుకు బిజెపి విశ్వప్రయత్నం చేస్తుందన్నారు. కులాలు, మతాల మధ్యన చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. బిజెపిని ఓడించేందుకు దేశవ్యాప్తంగా లౌకిక శక్తులతో చేతులు కలుపుతామని స్పష్టంచేశారు.



పర్యటనలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రాబోయే ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస పేపర్ లీకేజ్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, మండల ఇన్‌చార్జి ఉరడీ సుదర్శన్ రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచారు

- కిరణ్‌కుమార్‌రెడ్డిపై విహెచ్ ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంత్రి కూడా కానీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని చేస్తే.. ఆ విశ్వాసాన్ని మరచిపోయి కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచారని మాజీ ఎంపి వి హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ఆయన బిజెపిలో చేరడం దుర్మార్గమని చెప్పారు. ఆస్తులను కాపాడుకునేందుకు ఆయన బిజెపిలోకి పోయారని ఎద్దేవా చేశారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి

- సుంకేట అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలని కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లోని ధాన్యం కల్లాల్లో ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రూ. 1700 వందలకే రైతులు ధాన్యాన్ని అమ్ముకునే దుస్థితి వచ్చిందని తెలిపారు. రైతులకు తూకం పట్టి కొనుగోలు కేంద్రాల్లోనే ఇవ్వాలని కోరారు.

బండి సంజయ్ అరెస్టు అంతా నాటకమే : పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ అరెస్టు అంతా నాటకమేనని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. విద్యార్థుల జీవితాలతో బిజెపి, బిఆర్ఎస్ ఆడుకుంటున్నాయని విమర్శించారు. పేపర్ లీక్ కాదు... మాస్ కాపీయింగ్ అంటూ పోలీసు కమిషనర్ తేల్చి చెప్పారని గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మెట్టు సాయికుమార్, చరణ్ కౌశిక్‌లతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బండి సంజయ్ అరెస్టును బిఆర్ఎస్ పక్కా ప్లాన్ ప్రకారం చేసిందన్నారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచేందుకు అమిత్‌షా, కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.

'భగీరథ'లో బతుకు భారం

- ఏడాది కాలంగా జీతాల్లేని ల్యాబ్ సిబ్బంది
- జీతాలడిగితే ఉన్నతాధికారుల చులకన మాటలు
- ఆకలితో గడుపుతున్న 320 కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది
- ఏడాదిగా పెండింగ్‌లో రూ. 7.70కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిషన్ భగీరథ శాఖలో నీటి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి ఫలితాలు అందించే ప్రయోగశాలల సిబ్బంది బతుకు భారంగా మారింది. ఏడాది కాలంగా జీతాలు రాక ఆ ఉద్యోగుల కుటుంబాలు అప్పులపాలయ్యాయి. రెన్నెళ్లు, మూన్నెళ్లు.. ఎదురుచూసిన సిబ్బంది ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటూ వచ్చినా.. వేతనాలు రాక ఏడాది గడిచిపోయింది. పది రోజుల కిందట సంబంధిత శాఖ ఉన్నతాధికారులను కలిస్తే 'ఉంటే ఉండండి.. లేదంటే ఉద్యోగం మానేయండి.. ఎక్కువ మాట్లాడితే మేమే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అంటూ బెదిరింపులతో చులకన చేసి మాట్లాడారని పలువురు సిబ్బంది 'ప్రజాశక్తి'తో వాపోయారు. ఆందోళనకు దిగలేక.. జీతాలు రాక కుటుంబం గడవక వారంతా ఆకలితో అలమటిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 320 మంది సిబ్బందికి సంబంధించి ఏడాది కాలంగా జీతాల బకాయిలే రూ.7.70కోట్లు ఉన్నాయంటే వారి పరిస్థితి ఎలా ఉందో



అర్థం చేసుకోవచ్చు.

గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న నీటి నాణ్యత పరీక్ష కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ భగీరథ' శాఖలో విలీనం చేసింది. దీని కింద ఒక రాష్ట్ర స్థాయి ల్యాబ్ సహ తొమ్మిది పాత జిల్లా కేంద్రాలు, మరో తొమ్మిది డివిజన్ స్థాయి, 57 సబ్ డివిజన్ స్థాయి కేంద్రాలుగా వీడదీసింది. రాష్ట్ర వ్యాప్తంగా 75 నీటినాణ్యతను పరీక్షించే ల్యాబ్‌లను నిర్వహిస్తోంది. ఇందులో కెమిస్ట్, మైక్రోబయాలజిస్టు, హెల్పర్, ఫీల్డ్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ కలిపి మొత్తం ఆరుగురు చొప్పున తొమ్మిది పాత జిల్లా కేంద్ర ల్యాబ్‌ల్లో పని చేస్తున్నారు. మిగిలిన 64 కేంద్రాల్లో ల్యాబ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ మినహా.. నలుగురు సిబ్బంది చొప్పున విధుల్లో ఉన్నారు. వీరి పనిని పర్యవేక్షించేందుకు అదనంగా ప్రతి పాత జిల్లా కేంద్రంగా ఒక కన్సల్టెంట్ ఉద్యోగి ఉన్నారు. మొత్తంగా మిషన్ భగీరథ శాఖలోని నీటి నాణ్యతను పరీక్షించే ల్యాబ్‌ల్లో 319 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు.

వేతనం రాకున్నా ఆగని నీటి నమూనా పరీక్షలు

కన్సల్టెంట్లు, కెమిస్ట్‌లు, మైక్రోబయాలజిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హెల్పర్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లంతా ఔట్‌సోర్సింగ్ కిందనే విధులు నిర్వహిస్తున్నారు. నీటి నమూనాలను సేకరించి, వాటిని పరీక్షించి ఫలితాలను గుర్తిస్తూ ఉంటారు. ఆ నాణ్యతా ప్రమాణాలపై సమాచారాన్ని నిత్యం నమోదు చేస్తుంటారు. గ్రామపంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమూనాలు సేకరించి, నీటి నాణ్యతపై అవగాహన కల్పిస్తుంటారు. ప్రతి నెలా ఒక్కో ల్యాబ్ నుంచి 250 నమూనాల నాణ్యత పరీక్ష సహా 50 సూక్ష్మజీవన నీటి పరీక్ష ఫలితాలు నమోదు చేస్తున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా 22,500 నమూనాలను నిత్యం పరీక్షించి ఫలితాలు నమోదు చేస్తుంటారు. ఏడాది కాలంగా జీతం రాకపోయినా 2.70లక్షల నమూనాలను పరీక్షించి ఫలితాలు సమోదు చేశారు. వీరు ఏళ్లుగా పని చేస్తున్నా.. ఉద్యోగాలు పర్మినెంట్‌కాక ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే సాగుతున్నారు.

జీతాల బకాయిలే రూ.7.70కోట్లు

రాష్ట్ర వ్యాప్తంగా ల్యాబ్‌ల్లో పని చేస్తున్న 319 మంది సిబ్బందికి ఏడాది కాలంగా జీతాలు రావడం లేదు. వీరికి వారి ఉద్యోగ స్థాయిని బట్టి నెలకు రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు ఇస్తున్నారు. కన్సల్టెంట్లకు రూ.35 వేలు ఇస్తున్నారు. అయితే ఈ మొత్తం సిబ్బందికి నెలకు రూ.64 లక్షల 18 వేల 500 జీతాలు చెల్లించాల్సి ఉంది. ఏడాదికి (12 నెలలకుగాను) రూ.ఏడుకోట్ల 70లక్షల 22వేలు జీతాల రూపంలో ప్రభుత్వం బకాయి పడింది.

కెసిఆర్ నిర్లక్ష్యం వల్లే ఎంఎంటిఎస్ పనులు ఆలస్యం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్లక్ష్యం వల్లే ఎంఎంటిఎస్ పనులు పెండింగ్‌లో పడుతున్నాయని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి విమర్శించారు. సిఎం కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని నవ్వులపాలు చేస్తున్నారని తెలిపారు. బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని పక్కనపెట్టి... బంగారు కుటుంబాన్ని నిర్మించుకున్నారని ఆరోపించారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు.

తొమ్మిదేళ్లలో ఒక్క రోజైనా ప్రధాని మోడీ సెలవు తీసుకోలేదన్నారు. కెసిఆర్ మాత్రం తొమ్మిదేళ్లలో ఒక్కసారైనా సచివాలయానికి రాలేదని ఎద్దేవా చేశారు. బిజెపిని అణచేందుకు సిఎం కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ల లీకేజీ కారణంగా లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీని ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.

రాష్ట్రానికి అవసరమైన వ్యాక్సిన్లు పంపండి

కేంద్రానికి మంత్రి హరీష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా కట్టడిలో అతి ముఖ్యమైన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నట్టు స్పష్టమైంది. ఒకవైపు కరోనా కేసులు పెరుగుతున్నాయంటూ రాష్ట్రాలను అప్రమత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, వ్యాక్సిన్ సరఫరాలో మాత్రం నిర్లక్ష్యం చూపిస్తోంది. తమకు వ్యాక్సిన్లు సరఫరా చేయాలని కోరిన పలు రాష్ట్రాల మంత్రులకు వ్యాక్సిన్ సరఫరా చేసేది లేదని, సొంతంగా కొనుగోలు చేసుకోవాలని సూచించింది. దీంతో వ్యాక్సిన్ సరఫరాపై కేంద్రం చేతులెత్తేసినట్టయింది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కరోనా పరిస్థితులు, సంసిద్ధతపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవీయ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్, వ్యాక్సినేషన్, అప్రాప్రియేట్ బిహేవియర్ వంటి ఐదంచెల వ్యూహాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు మాట్లాడుతూ కరోనా కట్టడిలో, వ్యాక్సినేషన్‌లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కరోనా పరిస్థితులు రాష్ట్రంలో పూర్తిగా అదుపులో ఉన్నాయనీ, ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. ప్రికాషనరీ డోసుల్లో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉన్నట్టు చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడంతో నిల్వలు లేకుండా పోయినట్టు చెప్పారు. దీంతో వ్యాక్సినేషన్ నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన వ్యాక్సిన్ డోసులను తక్షణమే సరఫరా చేయాలని కోరారు. ఈ విషయంలో ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్టు గుర్తు చేశారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలుసైతం తమకు వ్యాక్సిన్ సరఫరా నిలిచిపోయిందనీ, దీంతో వ్యాక్సినేషన్ కార్యక్రమానికి అంతరాయం కలుగుతున్నట్టు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయ మాట్లాడుతూ.. కావల్సిన వ్యాక్సిన్లు ఆయా రాష్ట్రాలు కొనుగోలు చేసుకోవచ్చని, బహిరంగా మార్కెట్‌లో పుష్కలంగా నిల్వలు ఉన్నాయని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా హైదరాబాద్ ఫార్మా సంస్థ బయోలాజికల్ సహకారంతో 15 లక్షల డోసులు సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వ్యాక్సిన్ డోసులను సరఫరా చేసేందుకు ముందుకు వచ్చిన బయోలాజికల్ ఇఎండీ మహిమా ధాట్లకు ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాని పర్యటనకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని మోదీ పర్యటనకు పోలీసుల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. మోదీ పర్యటనకు వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర పోలీస్ సిబ్బంది సహా కేంద్ర బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ట్రయిల్ రన్ పూర్తి చేశారు. బేగంపేట్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాని పర్యటన అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో శనివారం ఉదయం 11.30 గంటలకు సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్ వేదికగా సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. రూ.720 కోట్లతో చేపట్టనున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. బొల్లారం-మేడ్చల్, ఫలక్‌నుమా-ఉందానగర్ సెక్షన్లలో ఎంఎంటిఎస్ రైళ్లను ప్రారంభించనున్నారు. అదే వేదికపై ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే, పోలీసు, రెవెన్యూ, ఫైర్ తదితర విభాగాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

IN THE COURT OF HON'BLE III. ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DIST :: AT L.B.NAGAR O.S.NO. 307 OF 2016

Between:
Dr. G. Chandra Shekar Rao
.... Plaintiff
AND
Kandadi Prabhaker Reddy
(Died Per LR's) and others
…. Defendants

To,
Smt. Karwan Swathi
W/o Srikanth Reddy
(D/o. Kandadi Prabhaker Reddy)
R/O Badangpet Village, Balapur
Mandal R. R Dist-500058
... Defendant No.4

Please take notice that, the above named Plaintiff has filed the above SUIT for Specific Performance of agreement of sale dated 28.12.2014 against the Defendants in respect of Suit Schedule Property and the same has been posted for your appearance on 13-04-2023.

Hence, you are make it convenient to appear before the Hon'ble Court, on 13-04-2023 at 10:30 AM. Otherwise the matter will be decided against you.

**\\ By order of the court **
M/s. G. CHANDRA SHEKAR REDDY
Advocates
Plot No. 66, RTC Colony, Champapet, Hyderabad – 79.
Cell : 9391118889

కాంట్రాక్టు అధ్యాపకుల మౌన ఆవేదన ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను జారీ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మూల్యాంకనం కేంద్రాల వద్ద కాంట్రాక్టు అధ్యాపకుల మౌన ఆవేదన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టిఎస్‌జిసిసిఎల్ఎ-475) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తామంటూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈనెల ఏడో తేదీ దాటినా ఆ ఉత్తర్వులు ఇంకా రాకపోవడంతో కాంట్రాక్టు అధ్యాపకులు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తక్షణమే జోక్యం చేసుకుని క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ అయ్యేటట్టు చూడాలని కోరారు. ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి (సిఒఇ) జయప్రదభాయ్‌తోపాటు మూల్యాంకనం కేంద్రాల వద్ద క్యాంపు అధికారులను కలిసి వినతిపత్రాలను సమర్పించామని పేర్కొన్నారు. మొదటిరోజు మౌన ఆవేదన కార్యక్రమం విజయవంతమైందని, ఈనెల 11వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

సమాజహితాన్ని కోరేలా లఘుచిత్రాల నిర్మాణం

- దాశరథి థియేటర్, ఎస్‌వికె ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాల ప్రదానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజ హితాన్ని కోరేలా లఘుచిత్రాల నిర్మాణం ఉండాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అన్నారు. మూఢనమ్మకాలు, మాయలు, మంత్రాలు, ఖర్మ వంటి విశ్వాసాలను పెంపొందించేలా ఉండరాదని అభిప్రాయపడ్డారు. దాశరథి థియేటర్, సుందరయ్య విజ్ఞానకేంద్రం సంయుక్తాధ్వర్యంలో 50 లఘు చిత్రాల ప్రదర్శన చిత్రబృందానికి ప్రశంసాపత్రాల ప్రదానోత్సవ కార్యక్రమం దాశరథి థియేటర్ కన్వీనర్ బిడిఎల్ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వినయకుమార్ మాట్లాడారు. కథనంలో బలం ఉండే లఘుచిత్రాలూ వెండితెర అనుభూతిని ఇస్తాయన్నారు. ఆత్మహత్యకో, హత్యకో దారితీసేది ప్రేమే కాదని తెలియచెప్తూ, నేటి యువతరంలో సరికొత్త ఆలోచనలు రేకెత్తించేలా నిర్మితమైన లఘుచిత్రాలు మంచి అనుభూతిని మిగులుస్తున్నాయని చెప్పారు. సృజనకు పదునుపెట్టే రీతిలో నిర్మితమయ్యే లఘుచిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. దాశరథి థియేటర్ కో కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో ఎఎస్ రావు జీవిత చరిత్రతో సినిమాను నిర్మించనున్నట్టు చెప్పారు. అలాగే లఘుచిత్రాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగ యూట్యూబ్ ఛానల్‌నూ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా లఘుచిత్రాల నటులు, దర్శకులు, నిర్మాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో నటులు ఇఆర్ ధనుంజయ్‌గుప్తా, పి జగదీశ్, యుహెచ్ రఘురామచంద్ర, రాజనాల సత్య, రఘు, లక్ష్మీ, సోషల్ మీడియా కన్వీనర్ బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ దోపిడీ?

- రోజుకు బైక్‌కు రూ.425, కారుకు రూ.525
- మోడీజీ... జర దేఖోజీ పివైఎల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ దోపిడీని అరికట్టాలని పివైఎల్ డిమాండ్ చేసింది. ఒకరోజు బైక్ పార్కింగ్‌కి రూ.425, కారు పార్కింగ్‌కి రూ.525 వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. మోడీజీ... జర దేఖోజీ అంటూ శుక్రవారం హైదరాబాద్‌లో పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రధాని మోడీ శనివారం వందే భారత్ రైలును ప్రారంభించేందుకు వస్తున్నారని చెప్పారు. పార్కింగ్ ఫీజులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. పార్కింగ్‌ను ప్రయివేటు పరం చేయడం వల్లే ప్రయాణికులు నిలువుదోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. పదో నెంబర్ ప్లాట్ ఫాం వైపు ఏదైనా వాహనానికి ఎనిమిది నిమిషాల వరకు ఉచితం, ఆలోపు తిరిగి రాకపోతే 15 నిమిషాలకి రూ.100, ఆ తర్వాత 30 నిమిషాలకి రూ.200, ఆ సమయం దాటితే రూ.500 వరకు దారుణంగా వసూల్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వందే భారత్ రైలు చార్జీలు, పార్కింగ్ చార్జీలు సాధారణ ప్రజలు భరించే స్థాయిలో లేవని వివరించారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా చార్జీలుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర నాయకులు భూషణవేణి కృష్ణ, రవి కుమార్, కృష్ణ, ఆంజనేయులు, గణేష్, వినయ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపన వి'పత్తి'

- ఇళ్లలోనే క్వింటాళ్ల కొద్దీ పత్తి నిల్వలు
- గిట్టుబాటు కాని ధరతో కౌలురైతుల వెతలు
- రోజురోజుకు పడిపోతున్న రేట్లు
- కౌలు అడుగుతున్న భూ యజమానులు
- కౌలుదారులు, పట్టేదారుల మధ్య స్పర్ధలు
- ఒక్కో ఊరులో 60 శాతం పైగా నిల్వలు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'ఉగాది పోయి పక్షం రోజులైంది. పోయినేడు డబ్బులు కడితే.. కౌలు కాగితం తిరగరాసుకుందాం..' అని భూ యజమానులు కౌలురైతులకు కబురు పెడుతున్నారు. కానీ కౌలు రైతులు మాత్రం అందుకు సుముఖంగా లేరు. కారణం ఆశించిన ధరలు లేక క్వింటాళ్ల కొద్దీ పత్తి నిల్వలు ఇళ్లలోనే ఉన్నాయి. కొంతమంది పట్టేదారులు బాగా ఒత్తిడి చేస్తుండటంతో కౌలుదారులతో విభేదాలు, స్పర్ధలు చోటుచేసుకుంటున్నాయి. 'పత్తికి ఆశించిన ధర లేదు.. కళ్ల ముందే కనబడుతోంది.. డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి.. ఇట్లనే ఇబ్బంది పెడితే వచ్చే ఏడాది కౌలుకు ఇవ్వకపోయినా ఫర్వాలేదు' అని కొందరు కౌలుదారులు భూ యజమానులతో వాగ్వాదానికి దిగుతున్నారు. మరికొందరు మాత్రం నెల రోజుల సమయం పెట్టి.. ఎంతో కొంత తగ్గించాలని ప్రాధేయపడుతున్న ఉదంతాలు పల్లెల్లో కనిపిస్తున్నాయి. ప్రతియేటా జనవరి, ఫిబ్రవరి నాటికి పత్తి తీతలు పూర్తి చేసి ఆ పంటను తొలగించి, అమ్ముకోవడంతో పాటు దాని స్థానంలో రబీ మొక్కజొన్న, వరి, పెసర సాగు పెట్టుబడులకు ఆ డబ్బులు ఉపయోగించుకునే రైతులు ఈసారి మాత్రం అప్పు, చేబదుళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉత్పన్నమైంది. దీనికి పెట్టుబడి పంటగా భావించే పత్తి ధరల పతనమే ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో 'ప్రజాశక్తి' శుక్రవారం పర్యటించినప్పుడు పత్తి రైతులు తమ దీనావస్థలు చెప్పుకున్నారు.

ధరలేదు.. దిగుబడి రాలేదు..

ఖమ్మం జిల్లాలో పత్తి అధికంగా సేద్యం చేసే మండలాల్లో ముదిగొండ ఒక్కటి. జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాల వరకు పత్తి సాగు చేస్తే ముదిగొండలో 40 వేల ఎకరాల వరకు ఈ పంట వేస్తుంటారు. మండలంలోని పమ్మి రెవెన్యూలో 500 మంది రైతులు మూడు వేల ఎకరాల్లో పత్తి సేద్యం చేశారు. వీరిలో 300 మందికి పైగా కౌలుదారులే ఉన్నారు. ఖరీఫ్‌లో పత్తి వేసి, రబీలో ఆ పంటను తొలగించి మొక్కజొన్న సాగు చేస్తుంటారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి ఆశించిన దిగుబడి రాలేదు. సాధారణంగా ఎనిమిది క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈ ఏడాది నాలుగు క్వింటాళ్లలోపే వచ్చింది. క్వింటాకు రూ.12 వేలకు పైగా ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతుండగా ఈ ఏడాది ఆరంభంలో రూ.ఎనిమిది వేలకు పైచిలుకు రేట్లు పలికాయి. ఆ ధర మరింత పెరిగే సూచనలున్నాయనే సమాచారంతో రైతులు పంటను నిల్వ చేసుకున్నారు. కానీ రోజురోజుకు ధరలు పడిపోయాయి. ప్రస్తుతం రూ.ఆరు వేల వరకే పలుకుతోంది. ఈ నేపథ్యంలో పమ్మి గ్రామంలో ఇంటింటా పత్తి నిల్వలు పేరుకుపోయాయి. పత్తి తీత సమయంలో తుఫానులు రావడంతో కాయలు కుళ్లిపోయాయి. ఇప్పుడు ఆ పంటనంతా ఇళ్లలోనే నిల్వ చేయడంతో మకెర పురుగుల ఉధృతి అధికమైంది. ఈ పురుగులు ఒంటిపై పారడంతో దురదలు వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇదిలావుంటే పత్తి అమ్మడంతో వచ్చే డబ్బులను రబీ మొక్కజొన్న పెట్టుబడికి రైతులు వినియోగిస్తుంటారు. పత్తి అమ్మకపోవడంతో బయట అప్పులు తెచ్చి కౌలురైతులు పెట్టుబడి పెట్టారు. మొన్నటి అకాల వర్షాలకు ఎకరాల కొద్దీ మొక్కజొన్న చేలు దెబ్బతిన్నాయి. ఇటు పత్తి అమ్మలేక.. అటు మొక్కజొన్న దెబ్బతిని.. కౌలు ఎలా చెల్లించాలో అర్థంకాని దయనీయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామంలో ప్రతియేటా కౌలుకు తీసుకునే సమయంలో తొలుత సగం కౌలు చెల్లిస్తారు. పమ్మిలో ఆరుతడి పంటలు సాగు చేసే భూమికి ఎకరానికి రూ.20వేల చొప్పున కౌలు ఉంది. మాగాణైతే పది బస్తాల వడ్లు (రూ.15 నుంచి రూ.20వేలు) ఇవ్వాల్సి ఉంటుంది. ఉగాదికి కౌలు కాగితం తిరగరాస్తారు. కానీ ఈ ఏడాది మే నెలలో చెల్లిస్తామని రైతులు భూ యజమానులతో ఒప్పందం చేసుకుంటున్నారు. కొందరు ఒప్పుకుంటుండగా మరికొందరు అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రంగంలోకి దిగి నిల్వ ఉన్న పత్తి మొత్తాన్ని రూ.8000 పైగా ధర పెట్టి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సిసిఐ ధర పెంచి కొనుగోలు చేయాలి...

చిన్నపంగు రంజిత్‌కుమార్, కౌలు రైతు

నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. కౌలు కాక ఒక పంటకే ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. కానీ ఎకరానికి మూడు క్వింటాళ్ల చొప్పునే దిగుబడి వచ్చింది. ఐదు ఎకరాల పేరు మీద 20 క్వింటాళ్లు అవుతాయేమో..! కానీ పెట్టుబడి రూ.లక్షకు పైగా వచ్చింది. నూటికి రూ.రెండు చొప్పున వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడి పెట్టా. ఇప్పుడున్న ధరకు పత్తి అమ్మితే రూ.1.20 లక్షలు వస్తే ఎలా గిట్టుబాటు అవుతాయి. అందుకే సిసిఐ రంగంలోకి దిగైనా కనీసం రూ.ఎనిమిది వేలకు పైగా ధర పెట్టి కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

భార్యభర్తలం కూలికిపోయి వెళ్లదీస్తున్నాం...

స్వామి, కౌలు రైతు

నేను ఐదు ఎకరాలు మెరక, ఐదు ఎకరాలు మాగాణి కౌలుకు తీసుకున్నా. పత్తికి బయట అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టా. ప్రతియేటా పత్తి తీతలు పూర్తి కాగానే దాన్ని అమ్మగా వచ్చిన డబ్బులు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న వేస్తాం. ఈ ఏడాది పత్తి దిగబడి సరిగా లేదు.. ధర బాగా తగ్గింది. పంట మొత్తం 15 క్వింటాళ్లకు పైగా ఇంట్లోనే ఉంది. బయట అప్పులు తెచ్చాం. పెట్టుబడి పెట్టాం. వడ్డీలన్నీ పూడతాయని చేను దగ్గర పనిలేని రోజు.. నేను, మా ఆడమనిషి కూలికిపోతున్నాం. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాం. మొన్నటి అకాల వర్షానికి రెండు ఎకరాల మొక్కజొన్న పనికిరాకుండా పోయింది. ఇటు పత్తికి ధర లేదు.. అటు మొక్కజొన్న పోయింది. కౌలు ఎట్టకట్టాలి.. అప్పులెలా తీర్చాలి.. మా బతుకులెట్టా వెళ్లాలో అర్థం కావట్లేదు.



బస్సులోనించి పొగ వస్తున్న దృశ్యం

ఎలక్ట్రిక్ ఎసి బస్సులో మంటలు

- అదుపు చేసిన అగ్నిమాపక శాఖ అధికారులు
- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బేగంపేటలో నడుస్తున్న ఆర్‌టిసి ఎలక్ట్రిక్ ఎసి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం శంషాబాద్ నుంచి జెబిఎస్ వెళ్తున్న ఎసి ఎలక్ట్రికల్ బస్సు బేగంపేట ఎయిర్‌పోర్టు వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో డ్రైవర్ వెంటనే బస్సును ఆపడంతో ప్రయాణికులంతా దిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు తెలుస్తోంది.

ప్రధాని పర్యటనను నిరసించండి

- సమిష్టిగా వామపక్ష కార్యాచరణ
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం పట్ల వివక్షత చూపుతూ తెలంగాణ సిరులతల్లిగా పేరొందిన సింగరేణిని ప్రయివేటీకరణ చేసేందుకు యత్నిస్తున్న ప్రధాని మోడీ పర్యటనను నిరసిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బొగ్గుగనులను ప్రయివేటీకరణ చేస్తున్న మోడీ.. బీహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో బొగ్గు నిక్షేపాలను కోలిండియాకు అప్పగించారని ఆరోపించారు. విభజన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోగా ప్రధాని స్థాయిలో మోడీ అబద్దాలు చెబుతున్నారని తెలిపారు. కోయగూడెం ఒసిని అరవిందో కంపెనీకి అప్పగించారని తెలిపారు. గతంలో మోడీ వచ్చినప్పుడు సైతం రాష్ట్ర సమస్యలను పరిష్కారించాలని ర్యాలీ నిర్వహించామని, అయినా పట్టించుకోలేదని, రాష్ట్రానికి ఒక ఐఎం, ఐఐటీ, మెడికల్ కాలేజీ ఇవ్వని మోడీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు జరిగిన తీరు పార్లమెంట్ చరిత్రలోనే చీకటిరోజులని తెలిపారు. అదానీ రూ.13 లక్షల కోట్ల కుంభకోణానికి సంబంధించి ప్రతిపక్షాలు నిలదీయడంతోపాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుకు డిమాండ్ చేస్తుంటే దానికి సమాధానం చెప్పకపోగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బిజెపి ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ టెర్రరిస్టు కంటే ప్రమాదమని, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేందుకు ప్రయత్నించిన ఆయనపై కఠినచర్యలు తీసుకోవాలని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించి చైర్మెన్ జనార్ధన్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మొత్తం లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని తెలిపారు. రాష్ట్రవ్యాపితంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ జిఒ నెంబర్ 58 ద్వారా రెగ్యులరైజ్ చేసి పట్టాలివ్వాలని, ఇంటికి రూ.5 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి రంగాలపై దృష్టి సారించాలన్నారు. వామపక్ష సమిష్టి కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు. భవిష్యత్‌లో ఐక్యతను మరింత పెంపొందించేందుకు క్షేత్రస్థాయి వరకు సమావేశాలు నిర్వహిస్తామని, సంయుక్తంగా ఈ నెల తొమ్మిదిన హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోట ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జితేందర్ రెడ్డి, ఎస్‌కె జానిమియా తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీల పున:నియామకానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర పార్టీలో కీలకమైన ఐదు అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడుగా పొగాకు జైరామ్ చందర్, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీపతి సతీష్, దళిత విభాగం(ఎస్సి సెల్) రాష్ట్ర అధ్యక్షుడిగా పొలంపల్లి అశోక్, తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్(టిఎన్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడుగా పార్లపల్లి రవీందర్, టిఎన్‌టియుసి (కార్మిక విభాగం) రాష్ట్ర అధ్యక్షుడుగా ఎంకె బోస్ నియమితులయ్యారు. తాజాగా చేపట్టిన నూతన కమిటీల నియామకాల్లో నలుగురు నేతలకు మరోసారి సారధ్య బాధ్యతలను అప్పగించారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నూతనంగా నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు.

జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల్లో తెలంగాణకు 27 పురస్కారాలు

- నాలుగు కేటగిరీల్లో తొలి రెండు స్థానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల్లో తెలంగాణ పలు పురస్కారాలు దక్కించుకుంది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం తొమ్మిది విభాగాల్లో కలిపి 27 అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో తెలంగాణ రాష్ట్రంలోని పలు పంచాయతీలు ఎనిమిది అవార్డులను దక్కించుకున్నాయి. నాలుగు కేటగిరీల్లో రాష్ట్ర పంచాయతీలు మొదటి, రెండో స్థానంలో నిలిచాయి.

అవార్డులు దక్కించుకున్న పంచాయతీలు..

- వాటర్ సఫిషియంట్ పంచాయతీ విభాగం - జనగామ జిల్లా నెల్లుట్లకు అగ్రస్థానం.
- సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ విభాగం - మహబూబ్‌నగర్ జిల్లా కొంగట్‌పల్లికి మొదటి స్థానం.
- ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగం - సూర్యాపేట జిల్లా ఐపూర్‌కు అగ్రస్థానం.
- పావర్టీ ఫ్రీ విభాగం - గద్వాల జిల్లా మాన్‌దొడ్డికి రెండో స్థానం.
- ఉత్తమ బ్లాక్ పంచాయతీ - కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్
- ఉత్తమ జిల్లా పంచాయతీ విభాగం - ములుగు జిల్లా (రెండో స్థానం)
- గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ - ఆదిలాబాద్ జిల్లా ముఖ్రా-కే (మూడో స్థానం)
- కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయత్ - రంగారెడ్డి జిల్లా కన్హా (రెండో స్థానం)
- గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ (మరో విభాగం) - ఎర్రవెల్లి (తొలిస్థానం)

సిఎం కెసిఆర్ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైంది: హరీశ్‌రావు

జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవడం సిఎం కెసిఆర్ దార్శనికతకు నిదర్శనమని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 27వ జాతీయ పంచాయతీ అవార్డుల్లో తెలంగాణకు ఎనిమిది అవార్డులు వచ్చాయని, నాలుగు కేటగిరీల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ట్విటర్‌లో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వం, గ్రామీణాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత వల్లే ఇది సాధ్యమైందని హరీశ్‌రావు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బృందానికి అభినందనలు తెలిపారు.

పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి - కెటిఆర్

'జాతీయ స్థాయిలో తెలంగాణ మరోసారి మెరిసింది. జాతీయ పంచాయతీ రాజ్ అవార్డుల్లో మరోసారి సత్తాచాటింది. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణలో నమోదైంది. దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీలు తెలంగాణలోనే ఉన్నాయి. దార్శనికుడైన సీఎం కేసీఆర్ వల్లే అద్భుత పనితీరు సాధ్యం అయింది. కెసిఆర్ మానసపుత్రిక పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బృందానికి నా అభినందనలు" అని కెటిఆర్ తెలిపారు.



తెలంగాణ గ్రామీణ సంస్కృతికి గుర్తింపు

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు

ప్రజాశక్తి-కల్చరల్

కళా ప్రదర్శనలలోను సినిమాలలో తెలంగాణ గ్రామీణ సంస్కృతికి నేడు మంచి గుర్తింపు లభిస్తోందని పంచాయతీ రాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. నాటకం ప్రేక్షకునికి నేరుగా అనుసంధానంపై భావోద్వేగాలు రగిలించే మాధ్యమం అని ఆయన అన్నారు. అలాంటి భావోద్వేగాలను రగిలించిన సినిమా బలగం అని ఆయన పేర్కొన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నిర్వహణలో యవనిక పేరిట జరుగుతున్న నాటి కోత్సవలలో భాగంగా బలగం చిత్ర బృందానికి అభినందన సత్కారం జరిగింది. ముఖ్య అతిథిగా దయాకరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ గ్రామంలోనూ జరిగె వస్థవాలకు అద్దం బలగం అన్నారు. అకాడెమీ చైర్మన్ స్వాగతం పలుకుతూ గీత రచయిత కసర్ల శ్యాం వరంగల్‌కు చెందిన వారు కావటం గర్వంగా ఉందన్నారు. నటి ఝాన్సీ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ బలగం సినిమాలోని విశేషాలు కొనియాడారు. దర్శకుడు వేణు, గీత రచయిత కాసర్ల శ్యాం, నటి కావ్యలను సత్కరించారు. తొలుత ఓరుగల్లు శారదా నాట్య మండలి వారిచే షఫీ దర్శకత్వంలో ఫ్రీడమ్ ఫైటర్స్ నాటిక సభా అనంతరం జనపదం రేపెటరీ థియేటర్ వారిచే దెంచనాల శ్రీనివాస్ దర్శకత్వంలో పరాయి నాటిక ప్రదర్శించారు.

మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా శనివారం చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు వివిధ సందర్భాల్లో చేసిన వాగ్దానాలు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కాల్సిన హక్కులు, వాటాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరాకరిస్తోందని విమర్శించారు. వాటిని నిర్లక్ష్యం చేస్తూ, వివక్షను ప్రదర్శిస్తూ తీవ్ర అన్యాయం చేస్తోందని తెలిపారు. సింగరేణి వంటి సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించడానికి పూనుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా సింగరేణిలో మరోసారి బొగ్గుగనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రపన్నుతోందని తెలిపారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన, హార్టికల్చర్ విశ్వవిద్యాలయాలు, ఎన్‌టిపిసి విద్యుత్ కేంద్రం, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి విభజన చట్టంలో హామీల అమలు ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. యుపిఎ హయాంలో మంజూరైన ఐటిఐఆర్‌ను రద్దుచేసిందని తెలిపారు. కృష్ణా నదీజలాల పంపిణీ పంచాయితీపై రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుచేసి రెండు నదులను తన పరిధిలోకి కేంద్రం లాక్కుందని పేర్కొన్నారు. గిరిజన, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ శనివారం తెలంగాణకు రావడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

13, 14 తేదీల్లో పద్మశ్రీ శోభానాయుడు జయంత్యుత్సవ్

ప్రజాశక్తి-కల్చరల్

ఈ నెల 13,14 తేదీలలో విఖ్యాత కూచిపూడి నాట్య గురువు పద్మశ్రీ డాక్టర్ శోభా నాయుడు జయంత్యుత్సవ్ శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై నిర్వహిస్తున్నామని ఆమె శిష్యబృదం తెలిపారు. డాక్టర్ శోభానాయుడు నాలుగు దశాబ్దాలు పైగా వందల మందిని కూచిపూడి నాట్య కళలో శిక్షణ ఇచ్చారు. వారి శిష్యులు దేశ విదేశాల్లో స్థిరపడి నాట్య కళను వ్యాప్తి చేస్తున్నారు శిష్య ప్రశిష్య సంప్రదాయంగా వారి నాట్య ప్రదర్శన రెండు రోజులు జరుగుతాయి. తొలి రోజు ముఖ్య అతిథిగా నాట్య గురువు పద్మశ్రీ పద్మజా రెడ్డి పాల్గొని మదంగ కళాకారుడు పిఆర్‌సి శర్మను సత్కరిస్తారు. రెండవ రోజు 14 వ తేదీ కార్యక్రమానికి హైదర్రబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం నాట్య శాఖ ఆచార్యులు డాక్టర్ జొన్నల గడ్డ అనూరాధ పాల్గొని ప్రముఖ గాయకుడు అమలాపురం కన్నారావును సత్కరిస్తారు.

మోడీ కార్యక్రమాలు కెసిఆర్ దూరం

- బిఆర్ఎస్ నేత వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం సికింద్రాబాద్ పర్యటనకు ముఖ్యమంత్రి కెసిఆర్ దూరంగా ఉండనున్నారు. సికాంద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు మేడ్చల్-సికింద్రాబాద్-ఉందానగర్ మధ్య నూతనంగా ఎంఎంటిఎస్ రైళ్లను ప్రారంభిస్తారు. తెలంగాణ మీదగా వెళ్లే పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం చుట్టనున్నారు. అధికారిక కార్యక్రమాలన్నింటికీ సిఎం కెసిఆర్ హాజరు కావడంలేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, బిఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ప్రొటోకాల్‌ను పాటించకుండా సిఎంను ప్రధాని అవమానించారని చెప్పారు. గతంలో కొవిడ్ సమయంలో మోడీ హైదరాబాద్ వచ్చినప్పుడు..సిఎం వెళ్తానంటే వద్దన్నారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉన్న ముఖ్యమంత్రిని ఆరోజు ఎందుకు వద్దన్నారో ఇప్పటి వరకు చెప్పలేదన్నారు. సూత్రప్రాయంగా అంగీకరించిన 14 జాతీయ రహదారులను మంజూరు చేయకుండా పెండింగ్‌లో ఎందుకు పెట్టారో రాష్ట్ర పర్యటన సందర్భంగా నరేంద్ర మోడీ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలు ఎందుకు ఇవ్వడం లేదో తెలపాలన్నారు. విభజన చట్టం ప్రకారం రైల్వే లైన్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో గందరగోళం, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు బిజెపి కుట్రపన్నుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసేందుకు మతతత్వ బీజాలు నాటుతోందని మండిపడ్డారు. ఇప్పుడు కుట్రలు, కుతంత్రాల బిజెపి రాజ్యమేలుతోందని వినోద్ కుమార్ విమర్శించారు.

బండి సంజయ్ జైలు నుంచి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కరీంనగర్ ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం ఉదయం జైలు నుంచి విడుదలయ్యారు. గురువారం రాత్రి ఆయనకు బెయిల్ మంజూరు కావడంతో జైలు అధికారులు ఆయన్ను విడుదల చేశారు. సంజయ్ విడుదల నేపథ్యంలో కరీంనగర్‌లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో 144 సెక్షన్ విధించారు. సాయంత్రం ఆరు గంటల వరకు దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశించారు.

సంజయ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేయడం, మరోవైపు బెయిల్ కోసం సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై రాత్రి వరకు నిర్ణయం వెలువడకపోవడంతో గురువారం రోజంతా ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్ తరపు న్యాయవాదులు దాఖలు చేసిన బెయిల్ దరఖాస్తుపై గురువారం హనుమకొండ జిల్లా ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ రాపోలు అనిత సుదీర్ఘ విచారణ చేపట్టారు. అనంతరం రాత్రి పది గంటల సమయంలో బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. రూ.20 వేల సొంత పూచీకత్తుతోపాటు పలు షరతులు విధించారు. దేశం దాటి వెళ్లొద్దని, సాక్షులను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని, ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు సహకరించాలని ఆదేశించారు. బెయిల్ మంజూరవడంతో సంజయ్‌ను శుక్రవారం ఉదయం విడుదల చేశారు.

శుక్రవారం కరీంనగర్‌లో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నపత్రం బయటకు వచ్చిన ఘటనలో కమలాపూర్ ఎంజెపి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థిని అయిదేళ్ల పాటు డిబార్ చేయడం దారుణమన్నారు. బెదిరించి తన వద్ద పేపర్ లాక్కున్నారని బాలుడు చెబుతున్నాడు. అలాంటప్పుడు.. పరీక్షా కేంద్రం వద్ద కాపలాగా ఉన్న పోలీసులు ఏం చేస్తున్నారు? స్క్వాడ్‌లు ఏమయ్యాయి? రాజకీయ కక్షతో విద్యార్థి భవిష్యత్తు నాశనం చేయడం తగదన్నారు. వెంటనే విద్యార్థితో పరీక్షలు రాయించి.. అతని చదువు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తోందని బండి సంజయ్ తెలిపారు.